తెరిపివ్వని వాన..

పినపాక: వరద ఉధృతికి కొట్టుకుపోయిన పిట్టతోగు చప్టా

పినపాక , జూలై 21: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు పూర్తి స్థాయిలో నిండి మత్తడిలు పోస్తున్నాయి. పంట పొలాలను వరదనీరు ముంచెత్తింది. పోట్లపల్లి పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. వర్షాల కారణంగా అమరవరం, జానంపేట మధ్య గల పిట్టతోగు చప్టా కొట్టుకుపోయింది. దీంతో రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి ముంపు గ్రామాలైన చింతలబయ్యారం, రావిగూడెం, భూపతిరావుపేట, టీకొత్తగూడెం గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

గుండాలలో..

గుండాల, జూలై 21: మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని కిన్నెరసాని, మల్లన్నవాగు, ఏడుమలకల వాగులు ఉప్పొంగి పంహిస్తున్నాయి. ఏడుమలకల వాగుపై హై లెవల్ బ్రిడ్జి లేకపోవడంతో ఆదివారం అవతలి ఒడ్డు గ్రామాలైన నాగారం, పాలగూడెం, కొడవటంచ గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్థంబించి పోయాయి.

కరకగూడెంలో

కరకగూడెం, జూలై 21: మండల వ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న ఎడతరిపి లేని వర్షాలకు పలు గ్రామాల్లో పూర్తిగా జనజీవనం స్థంభించిపోయింది. చెరువులు జలకళను సంతరించుకుని నిండుకుండతో అలుగులు పోస్తున్నాయి. కరకగూడెంలోని పెద్దవాగు, మోతే వాగు, కల్వలనాగారం పరిధిలోని రాళ్లవాగు, గొల్లగూడెం పెద్దవాగు, బూడిదవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొత్తగూడెం– కోరంవారిగుంపు గ్రామాల మధ్య చప్టాపై వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పంచాయతీ అధికారులు గ్రామాల మధ్య ట్రాక్టర్ అడ్డంగా పెట్టి రాకపోకలు ఎస్సై రాజేందర్ బూడిదవాగు పరిసరాలను పరిశీలించి ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు.

మణుగూరులో..

మణుగూరు టౌన్, జూలై 21: మూడురోజులుగా కురిసిన వర్షాలకు మండలంలో వాగులు వంకలు పొంగి పొర్లి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని విఠల్‌రావ్‌నగర్‌లో గొగ్గల జయలక్ష్మి రేకుల ఇల్లు శనివారం రాత్రి కూలిపోయింది. స్థానికులు విద్యుత్ సరఫరా నిలిపివేసి కాపాడారు. ఇప్పూ, మిత్రమండలి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు తహసీల్దార్ రాఘవరెడ్డి సందర్శించి భరోసా కల్పించారు. రేగులగండి అలుగు పారడంతో కూనవరం మీదుగా ప్రవహించే కోడి పుంజుల వాగు ఉధృతంగా ప్రవహించింది. సాంబాయిగూడెం పంచాయతీ పేరంటాల చెరువు అలుగు పారడంతో పగిడేరు ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సింగరేని కాలరీస్ మణుగూరు ఏరియాలో బొగ్గు ఓబీ వెలికితీతకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ప్రజలు వాగులు దాటొద్దు..

ఆళ్లపల్లి, జులై 20: మండలంలోని గిరిజన గ్రామాల ప్రజలు వాగులు దాటవద్దని టేకులపల్లి సీఐ సురేష్ గౌడ్, ఎస్సై రతీశ్ అన్నారు. ఆదివారం మండలంలోని కిన్నెరసాని, జల్లేరు, కోడెల వాగులను సందర్శించారు. ఈ సందర్భంగా వాహనదారులు, ప్రజలతో మాట్లాడారు. గర్భిణులు, వృద్ధులు, బాలింతలు వాగులు దాటొద్దని, ప్రసవ సమయం దగ్గరగా ఉంటే తమ బంధువుల ఇంట్లో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బోడు ఎస్సై శ్రీకాంత్, ఏఎస్సై వెంకట్‌రెడ్డి, కానిస్టేబుల్స్ శ్రీనివాస్, కృష్ణమూర్తి, ఉపేందర్ పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీవో..

పర్ణశాల, జూలై 21: మండలంలో గోదావరి వరద ఉధృతి అధికంగా ఉండటంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినందున ఆర్డీవో దామోదర్‌రావు సున్నంబట్టి, కాశీనగరం గ్రామాల ప్రజలకు మంగవాయిబాడవ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. మంచినీటి లభ్యత, ఫ్యాన్లు, కిచెన్ షెడ్డు తదితర అన్ని ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఉన్నతాధికారి రాంప్రసాద్, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో ముత్యాలరావు, ఇరిగేషన్ ఏఈ రాజ్ సుహాస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

పాల్వంచ, జూలై 21 : ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ఆదివారం పాల్వంచ ప్రాంతంలోని పలు చెరువులు, కుంటలు, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వరద చేరి జలమయమయ్యాయి. ఇందిరాకాలనీ, జయమ్మకాలనీ, వికలాంగుల కాలనీ, తెలంగాణనగర్, ప్రశాంతికాలనీ, వెంగళరావుకాలనీ, రాజవ్‌కాలనీ, సోనియానగర్, సంజయ్‌నగర్, ఒడ్డుగూడెం ప్రాంతాల్లో వరద చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మొర్రేడువాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. బంగారుజాల, గుడిపాడు, గుర్రాలకుంట, శ్రీనివాసకాలనీ, పేట చెరువు, కుంటినాగులగూడెం ప్రాంతాల్లో వరిపొలాలు మునిగిపోయాయి.

'కిన్నెరసాని'లోకి భారీగా వరద

పాల్వంచ రూరల్, జూలై 21 : కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి ఆదివారం 16 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా, ఆదివారం సాయంత్రం ఇన్‌ఫ్లో 11 వేల క్యూసెక్కులు ఉండడంతో నీటిమట్టం 403.3 అడుగులకు చేరింది. దీంతో అధికారులు నాలుగు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. యానంబైలు వద్ద లోలెవల్ వంతెన పై నుంచి వరద ప్రవహిస్తుండడంతో కిన్నెరసాని అవతలి వైపున ఇరవై గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు ప్రాజెక్టు వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆళ్లపల్లి: జల్లెరువాగు చెక్‌డ్యాంపై నుంచి ప్రవాహిస్తున్న నీరు

కరకగూడెం: కొత్తగూడెం– కోరంవారిగుంపు గ్రామాల మధ్య రాకపోకలు నిలిపివేసి ట్రాక్టర్ అడ్డుపెట్టిన అధికారులు

ధృతంగా ప్రవహిస్తున్న పాల్వంచలోని మొర్రేడువాగు

మణుగూరు టౌన్: విఠల్‌రావు నగర్‌లో నేలకూలిన ఇల్లు

కరకగూడెం: భట్టుపల్లిలో ఇండ్లలోకి చేరిన వర్షపునీరు

అన్నదాన పథకానికి వితరణ

భద్రాచలం, జూలై 21: భద్రాచలం సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో నిర్వహించే ఉచిత అన్నదాన పథకానికి రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ వాస్తవ్యులు నాగబోతు రఘురాం రూ. 50వేలు దేవస్థానం అధికారులకు అందజేశారు. తొలుత వారు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోఉన్న ఉపాలయాలను సందర్శించి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

బూర్గంపాడు, జూలై 21: మండలంలోని సారపాక మేజర్ పంచాయతీ సుందరయ్యనగర్ కాలనీకి చెందిన సమ్మయ్య అనారోగ్యంతో శనివారం సాయంత్రం మృతి చెందాడు. కొడుకులు లేని కారణంగా కూతురే తండ్రికి తలకొరివి పెట్టింది. అంత్యక్రియలకు తీసుకెళ్లడానికి వాహనం డబ్బులు లేకపోవడంతో కాలనీ వాసులు కాంట్రాక్టర్ ఏసుబాబు తన ట్రాక్టర్ ఇచ్చి అంత్యక్రియలకు పంపించారు. కుటుంబ సభ్యులకు భోజన వసతి కల్పించారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బూర్గంపాడు, జూలై 21: మండలంలో భారీ వర్షాలు, గోదావరి వరదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రాజేశ్ కోరారు. ఆదివారం మండలంలో 14 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి దాటే అవకాశం ఉందని, అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరు ఇంటి నుంచి బయటికి రావొద్దని అన్నారు. వరద ముంపు ప్రాంతాల ప్రజలు అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలిరావాలని సూచించారు.

కొత్తపట్టాదారులకు రైతుబీమా

చర్ల, జూలై 21: కొత్తగా పట్టాదారు పాస్‌బుక్‌లు ఉన్న, ఇప్పటి వరకు రైతు బీమా చేయించుకోని రైతులు రైతుబీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శివరామప్రసాద్ అన్నారు. రైతుభీమాకు 1965 అగస్టు 14 నుంచి 2006 ఆగస్టు 14 మధ్య పుట్టినవారు మాత్రమే అర్హులన్నారు. ఆధార్‌కార్డులో 18 నుంచి 59 సంవత్సరాల వయసున్నవారు మాత్రమే బీమా చేయించుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు రైతు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జతచేయాలని అన్నారు.

ప్రజావాణికి సకాలంలో రావాలి

కొత్తగూడెం టౌన్, జూలై 21 : ఐడీఓసీ కార్యాలయంలో ఈ నెల 22వ తేదీ సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అన్నిశాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారివారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని పేర్కొన్నారు.

యువజన సంఘాల జిల్లా అధ్యక్షునిగా పసుమర్తి కిషోర్

చంద్రుగొండ, జూలై 21 : ఆర్య సంఘం యువజన సంఘాల జిల్లా అధ్యక్షునిగా పసుమర్తి కిషోర్ నియమితులయ్యారు. ఆదివారం జరిగిన ఆ సంఘం జిల్లా సమావేశంలో కిషోర్ చేత ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మినారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
OLD AGE HOME
★ఒంటేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం|| చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325766-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ముగ్గురు మంత్రులున్నా జిల్లాకు ఉపయోగం శూన్యం

చంద్రుగొండ, జూలై 21 : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ప్రజలకు ఉపయోగం శూన్యమని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గౌని నాగేశ్వరరావు విమర్శించాడు. ఆదివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో సీతారామప్రాజెక్టు నీళ్లు జిల్లాకే మొదట విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఏ మండలానికి నీరు ఇవ్వకుండా ఇతర జిల్లాలకు నీరు తీసుకుపోవడం అన్యాయమన్నారు. ఏజెన్సీ మండలాలకు నీరు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే భద్రాద్రి జిల్లాకు నీటిని కేటాయించాలని, లేదంటే రైతులతో కలిసి ప్రత్యక్ష కార్యచరణకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కే ఉమ్మర్, వరికూటి వెంకట్రావ్, ఎర్న శ్రీనివాస్, రాజేశ్, మోహన్, సత్యనారాయణ, కిసాన్ మంగ్య, బాలు పాల్గొన్నారు.

ఐదుగురు నకిలీ విలేకరుల అరెస్టు

కొత్తగూడెం క్రైం, జూలై 21 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలో ఐదుగురు నకిలీ విలేకరులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. పట్టణంలోని ఓ ఇంట్లో హత్య కేసుని అలుసుగా తీసుకుని.. వారి కుటుంబీకులను బెదిరించేందుకు పాల్పడిన ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. బర్లిఫీట్ ఏరియాలో ఇటీవల దాసరి పూర్ణ(50) అనే మహిళను తన భర్త శ్రీనివాస్ తలపై కొట్టడంతో ఆమె మృతిచెందిన విషయం విదితమే. సదరు మహిళ బంధువైన సన్యాసిబస్తీకి చెందిన దాసరి సాంబశివరావు ఆటోడ్రైవర్‌గా పనిచేసి కొంతకాలంగా విలేకరిగా చలామణి అవుతున్నాడు. వివాహేతర సంబంధం నేపథ్యంలో జరిగిన హత్యగా ప్రచురించకుండా ఉండాలంటే తమకు అడిగినంత డబ్బు ఇవ్వాలని శ్రీనివాస్ అనే వ్యక్తి మృతురాలి కుమారుడు కార్తీక్‌కు ఫోన్ చేసి ఇటీవల బెదిరించాడు. అదేరోజు రాత్రి చుంచుపల్లి మండలం శ్రీనగర్‌కాలనీకి చెందిన ఏలూరి రాజేష్(ప్రైవేటు ఉద్యోగి), హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన గుంటూరు శ్రీనివాసరావు, రుద్రంపూర్‌లోని మిలీనియం క్వార్టర్స్‌కి చెందిన మేకల రమేష్(ఫొటోగ్రాఫర్), మేదరబస్తీకి చెందిన బాదావత్ గణేష్(టీ మాస్టర్)తో పాటు దాసరి సాంబశివరావు కలిసి కార్తీక్ ఇంటివద్దకు వెళ్లి డబ్బులు డిమాండ్ చేశారు. కార్తీక్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు.

నీళ్ల కోసం పోరాటం తప్పదు

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఇల్లెందు రూరల్, జూలై 21 : సీతారామ ప్రాజెక్టు కోసం జిల్లాల్లో పెద్దఎత్తున ఉద్యమాలు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉండాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం ఏజెన్సీ ప్రాంతానికి నీళ్లు కేటాయించాలని రాజకీయ పార్టీలు, రైతులు, కుల సంఘాల ఆధ్వర్యంలో రాందేవ్ బాబా మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు రీడిజైన్ ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం నియోజకవర్గంతోపాటూ భద్రాచలం, పినపాక, ఇల్లెందు, మహబూబాబాద్ జిల్లాలోని నాలుగు మండలాలకు సీతారామ ప్రాజెక్టు నీళ్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరిస్తారని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసి గెలిపించారన్నారు. సీతారామ ప్రాజెక్టుతో జిల్లా ప్రజలకు నీరందించాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీపై ఉందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాబీర్‌పాష, ఏఐకేఎంఎస్ నాయకులు కాసాని ఐలయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు పాయం చిన్న చంద్రన్న, నాయకులు బానోత్ ఊక్లా, చంద్ర అరుణ, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, అబ్దుల్‌నభి, దేవరకొండ శంకర్, ఆలేటి కిరణ్ కుమార్, తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్ రావు, ఉపేందర్, నాయిని రాజు, బుర్ర వెంకన్న, బంధం నాగయ్య, ఉడుత ఐలయ్య, తాండ్ర లక్ష్మీనారాయణ, నజీర్ అహ్మద్, బానోత్ రాంసింగ్, యాకూబ్‌షావలి, గుగులోత్ రాంచందర్, బ్రహ్మం పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో డీఎస్పీ చంద్రబాను పూజలు

ఇల్లెందు రూరల్, జులై 21 : సాయిబాబా ఆలయంలో ఇల్లెందు డీఎస్పీ చంద్రబాను దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా జగదాంబసెంటర్లోని ఆలయంలో పూజలు చేసి పండితుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ మెంబర్లు డీఎస్పీ దంపతులకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్లు లేని చోట రోడ్డు వేశారు... ఇళ్లు ఉన్న చోట మరిచారు

ఆళ్లపల్లి, జూలై 21: ఇళ్లు ఉండి ప్రజలు తిరిగే చోట సీసీ రోడ్లు వేయకుండా, ఇళ్లు లేకుండా జనావాసలు లేనిచోట సీసీ రోడ్లు వేశారని మండలంలోని మర్కోడు పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన పలువురు మహిళలు ఆరోపించారు. ఆదివారం మహిళలు మాట్లాడుతూ ... గత ప్రభుత్వ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆధ్వర్యంలో బొమ్మెర ముత్తయ్య ఇంటి నుంచి దొడ్డి సమ్మయ్య ఇంటి వరకు, మెంతిని నాగయ్య ఇంటి నుంచి రేగడి చెరువు అలుగు వరకు, దొడ్డి సందీప్ ఇంటి నుంచి దొడ్డి బాబు ఇంటి వరకు సీసీ రోడ్లుకు శంకుస్థాపనలు చేశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అనుచరులు సీసీ రోడ్లను మళ్ళించి జనావాసాలు లేని చోట ఇదే కాలనీలోని చెందిన ముత్యాలమ్మగుడి వద్ద వేసారని ప్రజలు తిరిగే మట్టి రోడ్లను గుర్తించి సీసీ రోడ్లుగా మార్చాలని కోరుతున్నారు.

ముత్యాలమ్మ గుడి వద్ద జనవాసలు లేనిచోట నిర్మించిన సీసీ రోడ్డు, బురదరోడ్డును చూపిస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

జాయతీ రహదారికి తాత్కాలిక మర్మతులు

ప్రయాణం..ప్రాణసంకటం' కథనానికి స్పందన

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్..

మంత్రిగారు వస్తున్నారని గుంతలు పూడ్చారా..?

అధికారులపై స్థానికుల మండపాటు

అశ్వారావుపేట టౌన్, జూలై 21 : జాతీయ రహదారికి అధికారులు ఆదివారం తాత్కాలిక మర్మతులు చేపట్టారు. ఈ నెల 14న పేరుకు జాతీయ రహదారి.. రోడ్డంతా గుంతలమయం 'ప్రయాణం..ప్రాణ సంకటం' అనే కథనాన్ని 'నమస్తే తెలంగాణ'లో ఈ నెల 14న ప్రచురించింది. ఈ నేపథ్యంలో ఆర్‌అండ్‌బీ అధికారులు గుంతలను హడావుడిగా పూడ్చారు. కాగా మండలంలోని పెదవాగు వరదలకు కొట్టుకుపోవడంతో ప్రాజెక్టును పరిశీలించేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వచ్చారు. ఈ నేపథ్యంలో ఆర్‌అండ్‌బీ అధికారులు ఉదయం రింగ్ రోడ్డు నుంచి పాత పేరాయగూడెం వరకు సిమెంటుతో కూడిన చిప్స్‌ను పోసి పూడ్చారు. అయితే మంత్రి వస్తున్నారని రహదారి గుంతలు పూడ్చుతున్నారా లేకపోతే మర్మతులు చేపట్టరా..? అని వాహనదారులతో పాటు స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. గుంతలు నామ మాత్రంగా పూడ్చడంతో ముందు ముందు వచ్చే వర్షాలకు మళ్లీ యథావిధిగా జాతీయ రహదారి మారుతుందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో పనులు చేపట్టాలని కోరుతున్నారు.

జాతీయ రహదారిపై మర్మతులు చేపడుతున్న సిబ్బంది

పెదవాగు తప్పిదంపై చర్యలు శూన్యం

విచారణ చేయాలని మంత్రి తుమ్మల ఆదేశం

ప్రాజెక్టు వద్ద రైతుల మొర వినని యంత్రాంగం

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 21 (నమస్తే తెలంగాణ) : పెదవాగు ప్రాజెక్టుకు గండ్లు పడితే అధికారులపై చర్యలు శూన్యంగానే కనబడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇరిగేషన్‌శాఖలో ఒక కుదుపు కుదిపిన పెదవాగు ప్రాజెక్టులో చుక్కనీరు లేకుండా పోవడానికి కారణమైన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం మెమోలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ముందుగా లాకులు తెరిచి ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేది కాదని రైతులు మొత్తుకున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే ఘోర తప్పిదం జరిగినట్లు తెలుస్తుంది. ప్రాజెక్టులో భారీ వరద చేరినపుడు ఉదయం ఆరుగంటలకే సమాచారం ఇచ్చినా ఇరిగేషన్ అధికారులు స్పందించలేదని రైతులు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

విచారణ చేయాలని మంత్రి తుమ్మల ఆదేశం

పెదవాగు ప్రాజెక్టును సందర్శించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం జిల్లా అధికారులతో సమీక్ష చేశారు. ఇరిగేషన్ అధికారుల తప్పిదాన్ని బయటపెట్టారు కాని వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలువిమర్శలకు దారితీస్తున్నది. రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా కేవలం అధికారులు సమీక్షకే పరిమితం చేశారు. కలెక్టర్ జితేష్ విపాటిల్‌ను పెదవాగు ప్రాజెక్టుకు గండ్లు పడిన దానిపై విచారణ చేసి రిపోర్ట్ ఇవ్వమని ఆదేశించారు. మంత్రి తుమ్మల పర్యటనకు స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ లేకపోవడం విశేషం.

అంతా అయిపోయాక మంత్రుల పర్యటనలు

పెదవాగు ప్రాజెక్టు వల్ల భారీగా నష్టం జరిగితే జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ఎవరూ సమయానికి రాకపోవడంపై బీఆర్ఎస్ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. రైతులకు అన్యాయం జరిగితే పట్టించుకోకుండా ఘటన జరిగిన మూడురోజులు తర్వాత మంత్రులు ఒకరి తర్వాత ఒకరు వచ్చి పరిశీలన చేయడం వల్ల ఒరిగిందేమీ లేదని బీఆర్ఎస్ నాయకులు విమర్శిస్తున్నారు. రైతులు నష్టపోతే నేటికి ఎలాంటి పరిహారం ప్రకటించకపోవడం పట్ల రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీరామనవమికి పట్టువస్త్రాలు అందజేస్తాం

భద్రాద్రి దేవస్థానం ఇవో రమాదేవి

చర్ల, జూలై 21: పోకల దమ్మక్క యాత్రను పురస్కరించుకుని ఆదివారం మండలంలోని ఆర్ కొత్తగూడెం గ్రామంలోని శ్రీవిజయరామ ఆలయంలో శ్రీ సీతారాముల కల్యాణాన్ని అత్యం వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి భద్రాచలం దేవస్థానం ఈవో రమాదేవి హాజరై మాట్లాడారు. ప్రతియేడాది ఆర్ కొత్తగూడెం విజయరామ ఆలయలో జరిగే ఆలయానికి శ్రీరామనమినాడు శ్రీసీతారాములు కల్యాణానికి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు అందజేస్తామని అన్నారు.

పర్ణశాల పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

పర్ణశాల, జూలై 21: పర్ణశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్ ఆదివారం సందర్శించి రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఆర్ఎఫ్ఎస్ సర్వే చేయాలని, వ్యాధులు ప్రబలకుండా చూడాలని అన్నారు. అనంతరం గోదావరి వరద ఉధృతిని అడిగి తెలుసుకున్నారు.

ప్రశాంతంగా రాత పరీక్షలు

కొత్తగూడెం సింగరేణి, జూలై 21 : సింగరేణిలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 272 పోస్టుల భర్తీకి రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాత పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షల ఫలితాలు పది రోజుల్లో వెలువడనున్నాయి. మొట్టమొదటిసారిగా కంప్యూటర్ ఆధారితగా నిర్వహించిన పరీక్షల్లో మొత్తం 18,665 మందికి హాల్ టిక్కెట్లు జారీ చేయగా, 12,045 మంది పరీక్షలకు హాజరయ్యారు.

ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో రాణించాలి

ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం అర్బన్/లక్ష్మీదేవిపల్లి, జూలై 21 : ఆర్యవైశ్యులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలో ఆదివారం జరిగిన ఆర్య వైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజాభివృద్ధిలో ఆర్యవైశ్యుల పాత్ర ప్రముఖమైందని అన్నారు.

'ఉద్దేశపూర్వకంగానే మా బిల్లులు ఆపారు'

టేకులపల్లి, జూలై 21: సులానగర్ పీహెచ్‌సీ వైద్యుడు ఉద్దేశపూర్వకంగానే తమ బిల్లులను ఆపుతున్నారని ఇద్దరు వాహనదారులు వాపోయారు. మండలానికి చెందిన రామిశెట్టి వీరయ్య,కొత్త చిట్టిరాజు.. మండలంలోని కోయగూడెంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెక్కాడితేగానీ డొక్కాడని తాము.. తమ రెండు టాటా మ్యాజిక్ వాహనాలను గత ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం కోసం గత ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలల్లో సులానగర్ పీహెచ్‌సీకి అద్దెకు తిప్పామని అన్నారు. కార్యక్రమం పూర్తయిన 20 రోజుల్లోనే ప్రభుత్వం సదరు బిల్లులను మంజూరు చేసినప్పటికీ ఇక్కడి పీహెచ్‌సీ వైద్యుడు ఉద్దేశపూర్వకంగానే తమకు బిల్లులను రానీయడం లేదని ఆరోపించారు. కాగా, ఇదే విషయమై పీహెచ్‌సీ వైద్యుడు దినేశ్‌ను వివరణ కోరగా.. ఈ బిల్లులు ఎస్‌టీవో ఆఫీసులో నాలుగు సార్లు రిజెక్ట్ అయ్యాయని, సరిచేసి పంపించామని, ప్రస్తుతం ఈ–కుబేరులో ఆగాయని సమాధానమిచ్చారు.

మున్సిపాలిటీని ఎంతో అభివృద్ధి చేశాం..

చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి

కొత్తగూడెం అర్బన్, జూలై 21 : జిల్లా కేంద్రమైన కొత్తగూడెం మున్సిపాలిటీని గత నాలుగున్నరేళ్లుగా సుమారు రూ.214 కోట్లతో అభివృద్ధి చేశామని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. ఆదివారం కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆమె మా